క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలోని కణితి 11కేవీ ఫీడర్‌కు ఈ నెల 24న మెయింటెనెన్స్ పనులను చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా పాతగాజువాక, పంతులుగారి మేడ, చిట్టినాయుడు కాలనీ, పద్మజా ఆస్పత్రి ఏరియా, చట్టివానిపాలెం, దశమికొండ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి అమర్‌నాథ్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విశాఖ పోర్టు స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆహ్వానించారు. కరాటే పోటీల ఆర్గనైజింగ్ కమిటీ వైస్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు మిందిలో మంత్రిని కలిసి, ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: ఎన్‌టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో 76వ వార్డు నడుపూరులో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. గీతం ఆస్పత్రికి చెందిన వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, అప్పారావు, తాటికొండ సుదర్శన్‌రావు, పంచదార్ల ఉగ్రం, పీత వెంకటరావు పాల్గొన్నారు.

'ఎడ్యుస్కిల్ కనెక్ట్'లో ప్రతిభ



బహుమతులతో కళాశాల అధ్యాపకులు

గాజువాక: ఏఐసీటీఈ ఎడ్యుస్కిల్ ఆధ్వర్యంలో ఇటీవల గోవాలో నిర్వహించిన ఎడ్యుస్కిల్ కనెక్ట్-23 నెక్స్ కాన్‌క్లేవ్‌లో స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ఆరు బహుమతులను సాధించింది. ఈ బహుమతులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చేతులమీదుగా కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ ఎం.సందీప్ స్వీకరించారు. ఈ కనెక్ట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని రెండు కళాశాలలకు బహుమతులు వచ్చాయని, అందులో తమ కళాశాల ఒకటి కావడం సంతోషంగా ఉందని కరస్పాండెంట్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం సాకారం • హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

గతంలో ప్రతీ పనికి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి, జీవీఎంసీ పరిధిలో జోనల్ కార్యాలయానికి, ప్రధాన కార్యాలయానికి, కార్యాలయాల వెలుపల ఏర్పాటు చేసిన ఇతర కార్యాలయాలకు ప్రజలు తిరగాల్సి వచ్చేది. సమయం, డబ్బు వృథా అయ్యేవి. ఇప్పుడు సచివాలయ వ్యవస్థతో వార్డులోనే పనులు పూర్తవుతుండటంతో వ్యయ, ప్రయాసల బాధ తప్పింది. ప్రజలకు పాలన చేరువైంది. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.



76వ వార్డు పెదగంట్యాడ సచివాలయం-2లో ఆధార్ సేవలు అందిస్తున్న ఎడ్యుకేషన్ సెక్రటరీ గౌరీశంకర్

గాజువాక: గ్రామ స్వరాజ్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో ప్రధానమైన సచివాలయ వ్యవస్థ ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ప్రతీ వార్డులో ప్రజలకు ఇంటి సమీపంలోనే సులువుగా పరిష్కారం లభించేందుకు ఉద్దేశించిన ఈ వ్యవస్థ వారి మన్ననలు అందుకుంటోంది. ఈ వ్యవస్థతో పాలన అత్యంత సులువైంది. మూడేళ్ల క్రితం కరోనాతో జనం అల్లాడిపోతున్న సమయంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించి, అత్యంత చేరువైంది.

ప్రతీ వార్డులో సగటున ఆరు

నియోజకవర్గ పరిధిలో ప్రతీ వార్డులో సగటున ఆరు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి సగటున 11 మంది ఉద్యోగులను నియమించారు.

వార్డు సచివాలయాలు **106**

వార్డు సచివాలయ ఉద్యోగుల సంఖ్య **932**

వలంటీర్లు **1889**

చేరువైన సేవలు

- కుల, ఆదాయ, జనన, మరణ, ధ్రువపత్రాల నుంచి రైస్ కార్డులు, రిజిస్ట్రేషన్ల వరకు అన్ని పనులను సచివాలయాల్లో తక్కువ సమయంలో పూర్తి చేస్తున్నారు.
- ఏ పథకానికీ ఏ వ్యక్తి, రాజకీయ నేత, అధికారి ఇల్లు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.
- దళారీ వ్యవస్థ కనుమరుగైంది.
- అవినీతికి చోటు లేకుండా పోయింది.

ఇంటి దగ్గర్లోనే సచివాలయం



మా ఇంటికి సచివాలయం చాలా దగ్గర. గతంలో ఏ సర్టిఫికెట్ అయినా రెవెన్యూ కార్యాలయానికో, జోనల్ కార్యాలయానికో వెళ్లాల్సి వచ్చేది. నా భర్త మరణించడంతో డెత్ సర్టిఫికెట్, లీగల్ హెయిర్ వంటి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చింది. సచివాలయం దగ్గరే కావడంతో దరఖాస్తు చేయడం సులభమైంది. సర్టిఫికెట్లు వచ్చాక వలంటీరే ఇంటికి తీసుకు వచ్చి ఇచ్చారు. నాకు వితంతు పింఛన్ కూడా ప్రతీ నెలా ఒకటో తేదీకే వలంటీరే తీసుకువచ్చి అందిస్తున్నారు. పింఛన్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా నాకు సహాయం అందుతుంది. – దుంప రాధ, 70వ వార్డు



64వ వార్డు యాతపాలెం సచివాలయంలో లబ్ధిదారులకు అమ్మఒడి పథకంపై అవగాహన కల్పిస్తున్న అడ్మిన్ సెక్రటరీ త్రినాథ్

ప్రతీ 50 ఇళ్లకు ఓ వలంటీర్

గతంలో ప్రభుత్వం ఏ పథకం అమలు చేస్తుందో, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎవరిని సంప్రదించాలో ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లే ఇళ్లకు వెళ్లి పథకాలను వివరించి, వారే దరఖాస్తు చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు ఇతర పింఛన్లను ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యవస్థతో ప్రజల ఆత్మగౌరవం పెరిగింది. పింఛన్ల కోసం ఎండలో పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఎవరైనా లబ్ధిదారులు అనారోగ్యంతో దూరంగా ఉన్నా, ఆస్పత్రుల్లో చేరితే వలంటీర్లు అక్కడికి వెళ్లి కూడా పింఛన్లు అందజేసిన సందర్భాలు అనేకం.



అక్కిరెడ్డిపాలెంలో సచివాలయం



సంజీవగిరి కాలనీ సచివాలయం

ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ కోసం నేను ఏనాడూ ఎండలో నిలబడలేదు. వలంటీరు, సచివాలయ సిబ్బంది ప్రతినెలా ఒకటో తేదీనాడు ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు. నేను చాలా సంతోషంగా ఉన్నాను. – పెద్దాడ సన్యాసిరావు, 71వ వార్డు

వారే దరఖాస్తు చేయిస్తున్నారు



సచివాలయ సిబ్బంది చాలా సాయం చేశారు. నాకు వితంతు పింఛన్, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలు అందుతున్నాయి. ఈ పథకాల కోసం నాకు దరఖాస్తు చేయడం కూడా రాదు. అన్నీ వారే చేసి పథకాలు అందిస్తున్నారు.
– దాడి నూకరత్నం, అరుణోదయ కాలనీ

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1014వ రోజు, బుధవారం సంస్థకు చెందిన ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూటీడీ, ఆర్ అండ్ డీ, డీఎన్‌డబ్ల్యూ, ఈటీఎల్, టెలికామ్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్నచూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావుకు నివాళి



గుడివాడ గురునాథరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 22వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగ్రామం మిందిలో జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కనున్న గురునాథరావు విగ్రహానికి ఆయన తనయుడు, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న తనను ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో గురునాథరావు సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, రొక్కం వెంకటరావు, సంద్రాన నూకరాజు, ఈటి శ్యామలరావు, వాకపల్లి శేఖర్, స్వర్గీయ గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బాలవికాస్ దినోత్సవం



బాలవికాస్ విద్యార్థులతో స్టీల్‌ప్లాంట్ సీవీవో కరుణరాజు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో బుధవారం బాలవికాస్ దినోత్సవం ఘనంగా జరిగింది. సత్యసాయి 98వ జయంతి సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు వేదపఠనం చేశారు. నృత్యాలు ప్రదర్శించారు. అంతకు ముందు వేకువ జామున మందిరంలో సుప్రభాతం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్.కరుణరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఎంతో విశిష్టమైందన్నారు. ప్రపంచాన్ని నడిపించే రైలుకు భారతదేశం ఇంజిన్ వంటిదని, మిగతా దేశాల బోగీలు లాంటివన్నారు. బాలవికాస్ విద్యార్థుల వేదపఠనం, భజనలు ఎంతో ఆనందం కలిగించాయన్నారు. కార్యక్రమంలో వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్, బాలవికాస్ ఇన్‌చార్జి జయశ్రీ గణేశన్, సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

25న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



మింది జెడ్పీ హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 25వ తేదీన శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మింది వినాయక వేంకటేశ్వర సాయినాథ ఆలయ కమిటీ చైర్మన్ గుడివాడ నాగమణి తెలిపారు. ఈ మేరకు కల్యాణోత్సవం నిర్వహించనున్న పాఠశాల మైదానాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం 4.45 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8.01 గంటల నుంచి ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

సుపరిపాలనే లక్ష్యంగా వ్యవస్థల్లో మార్పు

- అవినీతిని సమూలంగా పాలద్రోలిన సీఎం
- అందుకే మళ్లీ జగనన్నే కావాలంటున్న ప్రజలు
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి వెల్లడి



73వ వార్డు సచివాలయం-4 వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



87వ వార్డులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



కార్యక్రమానికి హాజరైన ప్రజలు



65వ వార్డు సంజీవిగిరి కాలనీలో బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అవినీతిని సమూలంగా పాలద్రోలి అన్ని వ్యవస్థల్లోనూ మార్పు తీసుకువచ్చిన సీఎం జగన్ రాష్ట్రానికి మళ్లీ సీఎం కావడం ఎంతో అవసరమన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కళింగవీధి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండాను ఎగరవేశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కళింగవీధి సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాకముందు తలసరి ఆదాయంలో ఏపీ చాలా వెనకబడి ఉండేదన్నారు. ఇప్పుడు వ్యవసాయ, పరిశ్రమ, విద్య, వైద్య రంగాల్లో అనేక మార్పులు తీసుకువచ్చి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విదేశాల్లో తమ ప్రతిభ చూపించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మన సీఎందే అన్నారు. వైద్యరంగంలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. రైతు భరోసా, హెల్త్ క్లినిక్స్, సచివాలయ నిర్మాణాలు, 30 లక్షల మంది పేదవారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇచ్చారన్నారు. ఐదేళ్లలోనే ఇంత అభివృద్ధి చేస్తే.. మరోసారి సీఎం అయితే ఏపీ మరెంత అభివృద్ధి చెందుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ పి.సింహాచలం, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, వంద్రాసి సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆడారి శ్రీను, బొండా గోవిందరాజులు, వార్డు వాలంటీర్లు,గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ కృషితోనే అభివృద్ధి

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషే కారణమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని 65వ వార్డు సంజీవినగర్ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో 34 కోట్ల 93 లక్షల 12 వేల 933 రూపాయలతో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. మద్దాల అప్పారావు. లోకనాథం, నాగిశెట్టి శ్రీను, మంగునాయుడు, ఇరోతి గణేష్, మంత్రి మంజు ల, విఘ్నేష్, పుష్ప, లక్ష్మీ, భూలోక పాల్గొన్నారు.

- 73వ వార్డు సచివాలయం-4 వద్ద కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొన్నారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కంది పైడినాయుడు, ఆలీ, రామునాయుడు, నల్లా అప్పారావు, దాసరి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి

కూర్మన్నపాలెం: రోడ్డు భద్రతపై దువ్వాడ ట్రాఫిక్ ఎస్‌ఐ మహాలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కూర్మన్నపాలెం రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించినప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించి రెడ్, ఎల్లో, గ్రీన్ లైట్‌ల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. మైనర్లు వాహనాలను నడపడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అండిబోయిన జశ్వంత్ (ఫైల్)

పెదగంట్యాడ: బస్సు ఎక్కుతూ జారి పడిన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలివి.. పెదగంట్యాడ మండలం పెదకోరాడలో నివసిస్తున్న ఆటో డ్రైవర్ రాంబాబు, కనకమహాలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు జశ్వంత్ (27), కుమార్తె తనూజ ఉన్నారు. యశ్వంత్ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రోజూ ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వచ్చేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న దేవస్థానంలో లీజు హక్కులకు వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం లీజు హక్కులు ఖరారు చేయడానికి బుధవారం బహిరంగ వేలం, షీల్డ్ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల కాల పరిమితికి కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని 1 నుంచి 20 షాపులు లీజు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు.సింహగిరి టోల్‌గేట్ వద్ద ఏడాది పాటు టికెట్ల వసూలు చేసుకునేందుకు నిర్వహించిన షీల్డ్ టెండర్ కోటి 20లక్షల 50వేలకు వేశారు. సింహగిరిపై భక్తుల పాదరక్షలు భద్ర పరిచేందుకు వేసిన బహిరంగ వేలం పాట 36లక్షల 30వేలు హెచ్చుపాటకి వెళ్లింది. సింహగిరిపై టీ కాఫీ మిషన్ ద్వారా విక్రయించుకోవడానికి నిర్వహించిన షీల్డ్ టెండర్ 30వేలకు వెళ్లింది. వీటిని ఈవో పరిశీలించి కమిషనర్ ఆమోదానికి పంపించాల్సి ఉంది.

ఐరన్ ఓర్ సరఫరాకు సహకరించాలని వినతి



ఎన్‌ఎండీసీ ఈడీ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ఐరన్ ఓర్ సరఫరాకు సహకరించాలని స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎన్‌ఎండీసీ ఈడీ వెంకటేశ్వర్లును కోరారు. ఎన్‌ఎండీసీ బచేలి నుంచి స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన వెంకటేశ్వర్లును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో నడవడానికి రోజుకు 8 ర్యాకుల ఐరన్ ఓర్ అవసరమన్నారు. తద్వారా పూర్తి స్థాయి ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. దీనిపై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతానికి ఆరు ర్యాకుల ఐరన్ ఓర్ కచ్చితంగా సరఫరా చేస్తామని, భవిష్యత్తులో ఏడు ర్యాకుల సరఫరాకు ప్రయత్నిస్తామని తెలిపారు. స్లర్రీ పైపు లైను ద్వారా ఐరన్ ఓర్ సరఫరాకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అదే విధంగా రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కూడా కిరండూల్ లైన్ చేపట్టారని, అది పూర్తయితే సరఫరా ఇంకా మెరుగవుతుందన్నారు. ఈ సందర్భంగా ఈడీని సత్కరించారు. కార్యక్రమంలో సీజీఎం యు.శ్రీధర్, జీఎం గౌతమ్, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వి.ఎం.నాయుడు, బీ.ఎస్.రాజు, సుబ్బయ్య, నాయక్, ఏఐటీయూసీ మిత్రపక్షాల నాయకులు జె.రామకృష్ణ, మసేనురావు, బి.డేవిడ్, కె.శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.